# పులిరాజాకు ఎయిడ్స్ వస్తుందా?

-డా. బి.ఎస్.ఎన్.మూర్తి

"పులిరాజాకు ఎయిడ్స్ వస్తుందా?"

రోడ్డు పక్కన సిటీ బస్ షెల్టరుమీద కనిపిస్తోంది. అంతేకాదు. బస్సుల మీద, ఎడ్వర్టైజ్‌మెంట్ బోర్డుల మీద, పేపర్లలోనూ, పత్రికల్లోనూ అదే ప్రకటన. ఆ ప్రకటన చూసి 'వీర్రాజుకు ఎయిడ్స్ వస్తుందా?' అని చదువుకొని భయపడసాగాడు వీర్రాజు.

అతడు ఈ మధ్యన ఆ ప్రకటన రోజూ చూస్తున్నాడు. రోజూ భయపడుతున్నాడు. దానికి కారణం ఉంది. తను ఈ మధ్య ఒక తప్పుచేశాడు. అది భార్యతో చెప్పుకోలేడు. బయటపెట్టలేడు. అదేమంటే కొద్ది రోజుల ముందు ఒక స్నేహితుడు బలవంతం చేస్తే బార్‌కు వెళ్లాడు.

ఆ రోజు తన భార్య ఇంట్లో లేదు. పిల్లల్ని తీసుకొని ఊరికి వెళ్లింది. బార్‌లో పార్టీ అయ్యాక స్నేహితుడి ప్రోత్సాహం మరీ ఎక్కువయ్యింది. తనలో ఇంగిత జ్ఞానం నశించింది. ఆ స్నేహితుడి ప్రోద్బలంతో తనకు తెలియని స్త్రీతో ఆ రాత్రి కొంత సేపు గడిపాడు. తప్పు చేస్తున్నానన్న భావన మనస్సులో ఉంది కానీ, మత్తుమందు వివేకాన్ని కప్పేసింది.

మర్నాడు మరో స్నేహితుడికి తోడుగా హాస్పిటల్‌కు వెళ్లాడు. అక్కడ డాక్టరు కైలాసరావు ఒక రోగిని పరీక్షిస్తున్నారు. ఆ రోగి శుష్కించి పీలగా ఉన్నాడు. చర్మం పొలుసులుతేరి అసహ్యంగా ఉంది. మొహంలో జీవకళ లేదు. అతడి వయస్సు ముప్పై లోపే. అతడి భార్య, బంధువులూ అందరూ డాక్టరుగారిని ఆ రోగిని రక్షించమని పదే పదే ప్రాధేయపడుతున్నారు. కానీ డాక్టరు చెప్పారు. అతడికి ఎయిడ్స్ బాగా ముదిరిపోయింది రక్షించలేమనీ. ఆ రోగి అక్కడే అంతిమశ్వాస విడిచాడు. బాధ్యతలు పట్టని మరో లోకానికి వెళ్లిపోయాడు. ఇంకా విషాధకరమైన పరిస్థితి ఏమిటంటే అతడి ద్వారా అతడి భార్యకూ ఈ రోగం సోకిందట. వారికి ఒక కుమార్తె కూడా ఉంది. ఆ పిల్లను పెంచాల్సిన బాధ్యత తల్లిదే. ఆమెకూ ఈ రోగం సోకితే పిల్లగతి ఏంకానుంది? ఆ రోజు వీర్రాజుకు ఎన్నో సందేహాలు, డాక్టరుతో ప్రత్యేకంగా మాట్లాడాడు.

"ఆ రోగి ఎందుకు చచ్చిపోయాడు?"

"అతడికి ఎయిడ్స్ వచ్చింది" అన్నారు డాక్టరు.

"ఆ జబ్బు ఎందుకు వచ్చింది?"

"అది విశృంఖల శృంగారం వల్ల వచ్చింది. దేశంతటా ఈ వ్యాధి వ్యాపిస్తూ ఉండడానికి ఇదే ముఖ్య కారణం" అన్నారు.

వీర్రాజు మనస్సులో ఆందోళన మొదలయింది.

"ఒక్కసారి పొరపాటు చేసినా ఈ వ్యాధి రావచ్చా?"

"రావచ్చు" అన్నారు కైలాసరావు.

వీర్రాజు మదిలో ఆందోళనతో బాటు ఆలోచనల పరంపర. తను అవివేకమైన పనే చేశాడు. తను చేసిన చిన్న పొరపాటు తనను ఈ వ్యాధికి గురిచేస్తుందా? డాక్టరుతో ఈ విషయం చెప్పాలి అనుకుంటూ తను చేసిన పొరపాటు చెప్పాడు.

డాక్టరు కైలాసరావు అంతా విని అన్నారు. "ఈ వ్యాధి రాకుండా ఉండాలంటే జీవిత భాగస్వామితోనే శృంగార జీవితాన్ని పరిమితం చేసుకోవడమే మార్గం. ఏ వ్యక్తి అయినా తను చేసిన పొరపాటు వల్ల అతడి భార్యకూ ఈ వ్యాధి సోకవచ్చు. నీ విషయానికి వస్తే నువ్వు చేసిన పని సమాజపరంగా కూడా న్యాయం కాదు. నీతో సంపర్కం నెరపిన ఆ స్త్రీకి ఈ వ్యాధి ఉందో లేదో మనకు తెలియదు. ఆమెకు ఉంటే నీకూ సోకే అవకాశముంది"

వీర్రాజు గుండెలో రాయి పడింది. "నాకు ఆ వ్యాధి ఉందో లేదో ముందు పరీక్షించి చెప్పండి. అది నాకు రాలేదు అంటేనే నేను నిశ్చింతగా ఉండగలను. జీవితంలో మరెప్పుడూ పొరపాటు చెయ్యను" అన్నాడు.

"అప్పుడే చెప్పలేము. ఈ వ్యాధికి కారణమైన క్రిమి ఒక వైరస్. అది శరీరంలో ప్రవేశించాక మూడు నెలల తర్వాతే రక్త పరీక్షలో బయటపడుతుంది. దీనినే 'విండో పీరియడ్' అంటాము. ఈ విండో పీరియడ్ దాటే దాకా నీకు ఆ వ్యాధి సోకిందో లేదో నిర్ధారణ చేసుకునేందుకు వేచి చూడాలి" అంటూ మూడు నెలలు దాటాక ఒక రోజున చెకప్‌కు రమ్మన్నారు. మరో కండిషను చెప్పారు.

"నేను నీకు చెకప్ చేసి ఏ విషయమూ నిర్ధారణ చేసేదాకా నువ్వు నీ భార్యతో కూడా లైంగిక సంబంధం పెట్టుకోకూడదు. నీలో ఈ వ్యాధి ఉంటే ఆమెకూ సోకవచ్చు" అన్నాడు డాక్టర్.

చిత్రమైన పరిస్థితి వీర్రాజుది. తన గురించి తనకు తెలియడానికి మూడు మాసాలు ఆగాలి. ఆ రోజు నుండి అతడికి దిగులు మరీ ఎక్కువైంది. చేసిన ఒక్క పొరపాటుకు తన జీవితం బలికాబోతుందా? ఆ పొరపాటు తన భార్యా పిల్లల్ని వీధిన పడేస్తుందా? ఇన్నాళ్లూ కష్టసుఖాల్లో సహకరించిన తన భార్యకు తను అన్యాయం చేశాడా? తన పిల్లలకి తండ్రి ప్రేమ కరువయిపోతుందా? తను ఎన్నో కుటుంబాలు వీధిన పడడం చూశాడు. తన కుటుంబమూ ఆ లిస్టులో చేరబోతుందా?

భార్య సావిత్రికి అతడి ధోరణి అర్థం కావడం లేదు. భర్త ఇంతకుముందు ఉత్సాహంగా ఇంట్లో తిరిగేవాడు. సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు ఓ అయిదు రూపాయలు పెట్టి మిఠాయి కొని తెచ్చేవాడు. వారానికోసారి సాయంత్రం భార్యనీ, పిల్లల్నీ సినిమాకు తీసుకువెళ్లేవాడు. ఇంటికి తిరిగి వచ్చాక సినిమా కథ గురించి తామిద్దరూ ముచ్చటించుకునేవారు. కానీ ఈ మధ్యనే అతడి పద్ధతి పూర్తిగా మారిపోయింది. భర్త ఎందుకు అలా మారిపోయాడో ఆమెకు అర్థం కాలేదు. "ఒంట్లో నలతగా ఉందా?" అని చాలా సార్లు అడిగింది. "లేదు" అనే అతడి సమాధానం. ప్రేమగా భార్యా పిల్లల్ని పలుకరించలేకపోతున్నాడు. తను దగ్గరికి వస్తే దూరంగా జరిగిపోతున్నాడు. రాత్రిపూట దూరంగా పక్కవేసుకుంటాడు. పిల్లల్ని చూసినా భయపడుతున్నట్టు దూరంగా జరిగిపోతున్నాడు.

"ఆఫీసులో ఏమైనా గొడవ జరిగిందా?" అంటూ ఆమె అడిగేది.

"లేదు" అనే సమాధానం ఇచ్చేవాడు.

"మరెందుకు అయినవాళ్లందరికీ దూరంగా తిరుగుతున్నారు?" సావిత్రమ్మ ప్రశ్నకు అతడు జవాబివ్వలేదు.

ఈ మధ్యనే ఈ మార్పు అతడిలో కనిపిస్తుంది. పెళ్లయిన నాటి నుండీ తన కష్టసుఖాలు అర్థం చేసుకునే భర్త దొరికాడని ఇన్నాళ్లూ ఎంతో మురిసిపోయింది తను. కానీ ఇదేమిటీ చిత్రమైన మార్పు?

జరగరానిదేదో జరిగిందని మాత్రం ఆమె గ్రహించగలిగింది. ఈ మధ్య తను పిల్లలిద్దరితో సహా పుట్టింటికి వెళ్లి పది రోజులు ఉండి వచ్చింది. అప్పుడు బస్టాండుకు తన భర్తే స్వయంగా దిగబెట్టాడు. అప్పుడు బాగానే ఉన్నాడు. తొందరగా తిరిగివచ్చేయమని మరీమరీ చెప్పాడు. తమ రెండో కూతుర్ని ఎత్తుకొని ముద్దులు పెట్టుకుంటూ ఒక తకు గానీ వదల్లేదు. అలాటిది తను తిరిగివచ్చి

దగ్గిర నుండి అతడి ధోరణి మారిపోయింది. అతడిప్పుడు మనిషి కాదు. జడ పదార్థం. ఆమెకు తన భర్త ఏమీ అంతుపట్టడం లేదు. వీర్రాజుకు భయం మరీ ఎక్కువ కాసాగింది. రాత్రి ఒకంతకు గాని నిద్ర పట్టేది కాదు. నిద్రలో ఎయిడ్స్ రాక్షసి కోరలు చాచి తనను కబళించడానికి వస్తున్నట్టు, అది భూతంలా వెంట పడుతూంటే చీకట్లో ఎటో పరుగెడుతున్నట్టు కలవచ్చేది. గుండెలో దడ పుట్టేది. శరీరంలో వణుకు పుట్టేది. వళ్లంతా చెమట్లు పట్టేవి. కలవరంతో లేచేవాడు. మంచినీళ్లు తాగి నిద్రపోడానికి ప్రయత్నించేవాడు. మళ్లీ కల. కలలో ఎయిడ్స్ రాక్షసి... ప్రతి రాత్రి కాళరాత్రి. అతడి ధోరణిలో మార్పు లేదు. మూడునెలలు అతి కష్టంగా గడిచాయి.

ఆ రోజు డాక్టరు కైలాసరావు వీర్రాజుని హాస్పిటల్‌లో పరీక్ష చేయించుకోవడానికి రమ్మని చెప్పిన రోజు. వీర్రాజు వెళ్లగానే హాస్పిటల్‌లో అతడి రక్తం పరీక్ష కోసం తీశారు. రిపోర్టు ఇంకా రావాలి. అతడు హాస్పిటల్ కారిడార్లో తచ్చాడుతున్నాడు. మనస్సంతా టెన్షన్. రిపోర్టులో వ్యాధి లేనట్టు వస్తే ధీమాగా ఉండొచ్చు. జీవితం నిశ్చింతగా గడిపెయ్యవచ్చు. ఉన్నట్టు వస్తే తనో ఎయిడ్స్ రోగిగా ముద్ర వేయబడతాడు. బంధుమిత్రులందరూ తనను అంటరాని వాణ్నిగా చూస్తారు. దూరంగా ఉంచుతారు. ఈలోగా నర్సు వచ్చి చెప్పింది. డాక్టరుగారు లోపలికి రమ్మన్నారని. ఏ రిపోర్టు వినడానికైనా సిద్ధమేనన్నట్టు గుండె రాయి చేసుకుని లోపలికి వెళ్లాడు. అతడిని చూడగానే డాక్టరు కైలాసరావు "కంగ్రాట్యులేషన్స్. నీ రక్తపరీక్ష రిపోర్టు బాగుంది" అన్నారు.

"అంటే నాకు ఎయిడ్స్ రోగం లేనట్టేనా?" అన్నాడు వీర్రాజు.

"లేనట్టే"

"మరి రాదా?"

"నువ్వు పొరపాటు చెయ్యనంతవరకూ నీకు రాదు" అన్నారు కైలాసరావు.

అతడి మనస్సు సంతోషంతో ఉరకలు వేసింది. డాక్టరు దగ్గర సెలవు తీసుకొని బయటకు వచ్చాడు. ఇన్నాళ్లూ తనెంత చిత్రమైన అనుభూతికి భయభ్రాంతులకు లోనయ్యేడు? కుటుంబంలోని వారందర్నీ ఎంత మానసిక వ్యధకు గురిచేశాడు? అతడికే ఆశ్చర్యం కలిగింది. ఇంటికి తిరిగి వచ్చాడు. అతడి రాక కోసం ఎదురు చూస్తున్న భార్యాపిల్లల్ని ప్రేమగా పొదివి పట్టుకున్నాడు.

"నేను ఇంకెప్పుడూ పొరపాటు చెయ్యను" అన్నాడు.

అతడెందుకలా అన్నాడో వారికి అర్థం కాలేదు. కానీ అతడిలో మార్పు చూసి సావిత్రమ్మ సంతోషానికి అవధులులేవు. ఆ సాయంత్రం భార్యాపిల్లల్ని షికారుకని బయటకు తీసుకెళ్లాడు. రోడ్డు ప్రక్కన బోర్డు మీద 'పులిరాజాకు ఎయిడ్స్ వస్తుందా?' అన్న ప్రకటన పెద్ద అక్షరాలతో దర్శనమిచ్చింది. అతడు దాన్నే చూస్తూ నిలబడ్డాడు.

"వీర్రాజుకు ఎయిడ్స్ రాలేదు. పులిరాజా విషయం నాకు తెలియదు" అనుకున్నాడు. ఇంతలో భార్య సావిత్రి అతడి చేయి పట్టుకుంది. పిల్లలు వెంటరాగా అతడు ఆమెను అనుసరించాడు.

★

